## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-12-08, కాపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు గీతాజయంతి. కురుక్షేత్రంలో కౌరవులకు, పాండవులకు యుద్ధం జరిగింది. తాతగారిని, గురువుగారిని, బంధువులను ఎలా చంపటం అని యుద్ధభూమిలో అర్జునుడికి విషాదం వచ్చింది. అర్జునుడి యొక్క విషాదం భగవద్గీత చెప్పటానికి దారితీసింది. అర్జునుడికి విషాదం రాదు అనుకోండి, అక్కడ భగవద్గీత రాదు. అంటే ఒక సంఘటన ఇంకో సంఘటనకు దారితీసింది. భగవద్గీతను స్వయంగా నారాయణుడే చెప్పాడు అంటే మన హృదయంలో ఉన్న భగవంతుడే మానవరూపం ధరించి వచ్చి చెప్పిన శాస్త్రం భగవద్గీత. ఆ పుస్తకం విలువ మనకు తెలియటం లేదు. శంకరాచార్యులవారు రాకముందు భగవద్గీత అంత ప్రచారంలో లేదు. గీతలో అమృతం ఉంది, దానిని ఎవరూ చదవటం లేదు, భక్తులు అందరూ మిస్ అయిపోతున్నారు అని ఆయన గీతలో ప్రతీ శబ్దానికి అర్థం వ్రాసి, వ్యాఖ్యానం వ్రాసి, దేశం అంతా కాలి నడకన తిరిగి ఆచార్యులవారు భగవద్గీతను ప్రచారం చేసారు. ఆయన వ్రాసింది ప్రజలకు అర్థమయ్యేలాగ బోధించాడు. భగవద్గీతలో పరమాత్మ ఏమన్నాడు అంటే ఓ అర్జునా! ఎవడు నాకు ఎక్కువ ప్రీతిపాత్రుడు అంటే నీకు నాకు మధ్య జరిగిన ఈ సంభాషణను, ఈ శాస్త్రాన్ని ఎవడైతే అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, ఇతరులకు అర్థమయ్యేలాగ భోదిస్తున్నాడో వాడు నాకు ప్రీతిపాత్రుడు, వాడు నా హృదయానికి సన్నిహితంగా ఉంటాడు అని పరమాత్మ చెప్పాడు.

కోరిక, కోపము, ద్వేషము, అసూయ, కక్ష ఇవి అన్నీ మన లోపలఉన్న శత్రువులు. బయటశత్రువులకంటే లోపలఉన్న శత్రువుల వల్ల ఎక్కువ ప్రమాదం, ఇది ఎప్పడూ మీరు గుర్తుపెట్టుకోండి. మనం లోపలఉన్న శత్రువులను వదిలేసి బయటఉన్న శత్రువులను తిడుతూ ఉంటాము. నీకు పునర్జన్మలను తీసుకొని వచ్చేది బయట శత్రువులుకాదు, లోపలశత్రువులే పునర్జన్మలను తీసుకొని వస్తున్నారు. ధనబలంకంటే ధర్మబలం గొప్పది అని పెద్దలు చెపుతారు. ధనానికి కూడా బలం ఉందికాని దానికంటే ధర్మబలం గొప్పది. ఆడంబరమైన మాటలు చెప్పేవారు, అహంకారమైన మాటలు చెప్పేవారు ఎందుకూ పనికిరారు. వారు పని ఏమి చేయరు, ఏవో డబ్బామాటలు చెప్పి వెళ్లిపోతారు. ఎక్కువ మాట్లాడేవారికి ఏమీ తెలియదు, తెలిసినవారు ఎక్కువ మాట్లాడరు అని సామెత కూడా ఉంది. గీతలో పరమాత్మ అన్ని మార్గాల గురించి చెప్పాడు. ఆయన భక్తి మార్గం గురించి చెప్పాడు, కర్మమార్గం గురించి చెప్పాడు, జ్ఞానమార్గం

గురించి చెప్పాడు. రామకృష్ణ పరమహంసగారు భక్తిమార్గాన్ని ఎత్తి చూపారు, రమణమహర్షిగారు జ్ఞానమార్గాన్ని ఎత్తిచూపారు. ఇలా ఒకో ఋషి ఒకో మార్గాన్ని ఎత్తిచూపారు. కృష్ణుడు అలాగ చేయలేదు. ఎంజాయ్ ఎటర్నిటీ, ఎంజాయ్ బ్లిస్ ఎవ్విరివేర్ అని చెప్పాడు. అరుణాచలంలో మోక్షం ఉంది, కాశీలో మోక్షం ఉంది, ఇక్కడ ఏమీలేదు అంటే మీకు సబ్జక్టు అర్థమవ్వలేదు అని పరమాత్మ చెప్పాడు. ప్రపంచంలో మనుషులు రకరకాలుగా ఉంటారు. ఏ ఇద్దరి బిహేవియర్ ఒక రకంగా ఉండదు, భిన్నత్వం ఉంటుంది, ఇది ప్రకృతి. ఈ అనేకత్వంలో, భిన్నత్వంలో అంతర్యామిగా ఉన్న నారాయణుడిని ఎలా చూడాలో గీతలో పరమాత్మ వివరంగా చెప్పాడు. అది గీత యొక్క వైభవం. మనుషులు రకరకాలుగా ఉంటారు. వారి శరీరాలు వదిలేయండి, వారి మనస్సులు వదిలేయండి, వారి గుణాలు వదిలేయండి, వారి జన్మల గొడవ వదిలేయండి. అన్నింటిని వదిలేసి అందరిలోను అంతర్యామిగా ఉన్న నన్ను చూడండి అనిపరమాత్మ చెపుతున్నాడు. పరమాత్మ మన హృదయంలో ఉన్నాడు. ఆయన ఉన్న గుహలోనికి మనం వెళ్ళాలంటే కేవలం మన తెలివితేటలు సరిపోవు. మేము మంచివారము, దానాలు చేసాము, ధర్మాలు చేసాము అని మీలో మీరు అనుకొన్నా లోపలకు వెళ్ళలేరు. మన హృదయంలో ఉన్న పరమాత్మకు మన మీద దయకలిగి ఆయన మనలను లాక్కొంటే మనం లోపలకు వెళ్ళగలము కాని మన ప్రయత్నం వలన అది సాధ్యంకాదు.

మీకు ఏదైనా కోరిక ఉంది అనుకోండి. ఆ కోరికలో నుండి కోపం వచ్చేస్తుంది. మీ పని ఎవడైనా చెడగొడితే వాడి మీద ద్వేషం వచ్చేస్తుంది, కక్ష వచ్చేస్తుంది. మీరు అరుణాచలం వెళ్తాను అంటే మీ ఆయన వద్దంటారు అనుకోండి, వెంటనే విరోధం, పైకి విరోధం నటించకపోయినా లోపల మానసికంగా దూరమైపోతారు. మీకు ఏ రకమైన కోరిక ఉన్నా అన్ని చెడ్డగుణాలు ఉన్నట్లే. మనం ఏదైనా ఒక మాట మాట్లాడేటప్పుడు పదిసార్లు ఆలోచించికాని ఒకమాట మాట్లాడకూడదు, పదిసార్లు ఆలోచించికాని ఒక పని చేయకూడదు. నిన్ను నీవు తెలుసుకోవటంకంటే మించిన పనికాని, నిన్ను నీవు తెలుసుకోవటంకంటే మించిన జ్ఞానంకాని, నిన్ను నీవు తెలుసుకోవటంకంటే మించిన సాధన కాని ఏమైనా ఉందా అని పరమాత్మ అడుగుతున్నాడు. నీవు ఎవరో నీకు తెలియనప్పుడు నీకు ఎంత ధనం ఉన్నా, ఎంత తెలివి ఉన్నా ఒకటి లేని సున్నలతో సమానము. నిన్ను నీవు తెలుసుకోవటంకంటే మించిన వైభవం ఏమైనా ఉందా? ఏమీ లేదే అంటున్నాడు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా రాగద్వేషములు ఉంటాయి. అసలు మనకు ఎవరిమీద ఇష్టంలేదు అనుకోండి, ఎవరి మీద ద్వేషం లేదు

అనుకోండి. ఇంక మన మనస్సును బయటకు వెళ్ళమని గెంటినా అది వెళ్ళదు. మన కుటుంబంలో భార్యాభర్తల మధ్య, పిల్లల మధ్య ఉన్న ప్రేమలు కూడా నిజంకాదు, ఇదో నాటకం. మీ అమ్మాయిలలో ఒకరికి పది రూపాయలు ఎక్కువపెట్టి, ఇంకొకరికి పది రూపాయలు తక్కువ పెడితే వెంటనే వారు విరోధులు అయిపోతారు. ఇదంతా ప్రకృతి, ఈ ప్రకృతిలో ఉన్నప్పుడు ప్రకృతి లక్షణాలతోటే ఉంటావు. ఈ ప్రకృతిని దాటకుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ఈశ్వరానుగ్రహం లేకుండా, ఈశ్వరుని దయలేకుండా ఈ ప్రకృతిని నీవు ఓవర్‌కమ్ చేయలేవు.

నువ్వు ఏదైనా మాట్లాడేటప్పుడుగాని, ఏదైనా ఒక పని చేసేటప్పుడుగాని బాహ్యంగా ఈశ్వరుడు ఏమీ చూడడు. ఆ మాట మాట్లాడేటప్పుడు నీ తలంపు ఏమిటి, ఆ పని చేసేటప్పుడు నీ ఆలోచన ఏమిటి అని లోపల నీ మనస్సును, నీ హృదయాన్ని చూస్తాడు కాని బయట పనులు ఈశ్వరుడికి అక్కరలేదు. నువ్వు పని పనికోసమే చెయ్యి అప్పుడు ఈశ్వరుని దయకు పాత్రుడవుతావు. దేహం అబద్ధం, చావు అబద్ధం అన్నాడు సనత్‌కుమారుడు. దేహమే కల్పితం, ఇంక కల్పితానికి చావు ఏమిటి అన్నాడు. గాఢనిద్రలో ఎవరికైనా దేహం గొడవ ఉందా? లేదు. జాగ్రదవస్థలో నేను అనే తలంపు వచ్చాక అన్నీ వస్తున్నాయి. దేహమే నేను అనేది ఒక తలంపు. అలాగే చావు కూడా నిజంకాదు, ఇది కూడా ఒక తలంపే. నేను అనే మూలతలంపు ఉన్నప్పుడు ఇవి అన్నీ ఉన్నాయి లేకపోతే ఏదీ లేదు. నువ్వు కాని దేహంతోటి, నువ్వుకాని మనస్సుతోటి, నువ్వు కాని సమాజంతోటి, నువ్వు కాని పరిసరాలతోటి ఎంత కాలమైతే తాదాత్మ్యం పొందుతావో అంతకాలం ఈ భయాలు, చావులు, పుట్టుకలు నిన్ను వెంటాడుతూనే ఉంటాయి, ఎవరూ ఆపుచేయలేరు. మీకు బయట కారణాల వలన సంతోషం వస్తూ ఉన్నా, దుఃఖం వస్తూ ఉన్నా వాటిని బయటే వదిలేయండి. వాటిని లోపలకు తీసుకోవద్దు. వాటిని లోపలకు తీసుకొంటే అంతా పాయిజన్ అయిపోతుంది, మిమ్మల్ని మోక్షానికి రానివ్వరు, దారిలోనే అడ్డంగొట్టి బయటకు గెంటేస్తారు.

మనం బాగా సంతోషంగా ఉన్నప్పుడు తెలుసున్నవారిని కూడా మీరెవరు అంటాము, దుఃఖంగా ఉన్నప్పుడు డిప్రెషన్‌లోనికి వెళ్ళిపోతాము. నువ్వు బెంగపెట్టుకోవటానికి అసలు ఏమైనా ఉంటే కదా, నీకు డిప్రెషన్ దేనికి వచ్చింది? రాంగ్‌తింకింగ్‌లోనుండి ఇవి అన్నీ వస్తున్నాయి. నాకు రాంగ్‌తింకింగ్ ఉందని ఏడుస్తూ కూర్చోకూడదు. రాంగ్‌తింకింగ్‌లో నుండి రైట్‌తింకింగ్‌లోనికి మారాలి. కొత్తకొత్త గురువులు వచ్చేసారు. ఏదో ఒక కోణాన్ని పట్టుకొని ఇదే

సర్వస్వం అని చెప్పేస్తున్నారు. మనం భగవద్గీతను వదిలేస్తున్నాము. భగవద్గీతను చదివి అర్థం చేసుకొంటే ఆత్మజ్ఞానం మీ చేతిలో ఉంటుంది. కొంతమంది జ్ఞానమార్గానికి ఇచ్చిన విలువ కర్మమార్గానికి ఇవ్వరు. భగవద్గీతలో అన్నీ సమన్వయం చేసాడు. పరమాత్మ ఏమని చెప్పాడు అంటే జ్ఞానమార్గం నిన్ను ఎక్కడికి తీసుకొని వెళుతుందో కర్మమార్గం కూడా అక్కడికే తీసుకొని వెళుతుంది. అది వేరు, ఇది వేరు అని నీకు ఎవరైనా చెపితే చంటిపిల్లల మాటలకింద ఆ మాటలను వదిలేయండి, అటువంటి మాటలను భుజాన వేసుకొని తిరగవద్దు అని చెప్పాడు. ఇతరులను బాగుచేద్దాము అనుకొనే బదులు ముందు నువ్వు బాగుపడు. సంస్కర్తలు కావలెను, సంస్కర్తలు కావలెను, ఇతరులను సంస్కరించే వాళ్ళుకాదు, వాళ్ళని వాళ్ళు సంస్కరించుకొనే వారు కావలెను. నీ మనస్సును బాగు చేసుకోవటంకంటే మించిన పని ఏమైనా ఉందా? సత్కర్మ నిష్కామంగా ఎందుకు చేయమన్నారు అంటే దాని వలన మనస్సు ఏకాగ్రమవుతుంది, నిర్మలమవుతుంది, పరిశుద్ధమౌతుంది. మీకు నాది అనే తలంపు ఉన్నప్పుడు మీకు ఒక్క ఎకరం ఉంటే చాలు దానివలన ప్లెజర్ వచ్చేస్తుంది. నాది అనే తలంపు మీకు లేనప్పుడు మీకు వెయ్యి ఎకరాలు ఉన్నా దానివలన మీకు బాహ్యం నుండి ఏమీ సంతోషం రాదు.

నువ్వు సాధన చేసి ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకోవాలి. ఎందుచేతనంటే ఇష్టాలు, అయిష్టాలు ఉన్నంతసేపు మీరు ఎంత ప్రయత్నం చేసినా మనస్సు బయటకు పోతూ ఉంటుంది, దానిని ఎవరూ ఆపలేరు. మన హృదయంలో పరమాత్మ అంతర్యామిగా ఉన్నాడు. కాని మన మనస్సులో రాగద్వేషములు ఉన్నంతకాలం ఆయన మనకు అనుభవంలోనికి రాడు. మనస్సు అనే గడప దాటనంతకాలం మనం ప్రకృతిలో ఉన్నట్లే, మనకు జన్మలు వస్తూనే ఉంటాయి. నువ్వు సంపాదించేది ఏమీ లేదు, ఊడగొట్టుకోవలసిందే ఉంది. అంటే ఉన్నదేదో ఉంది, అది నీకు అనుభవంలోనికి రాకుండా ఏవైతే అడ్డు వస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికే సాధన. అంతఃకరణాన్ని శుద్ధి చేసుకో. అది ఎలా ఉంది, ఆత్మజ్ఞాన సముపార్జనకు ప్రిపేర్ అవుతోందా, లేదా అని పరిశీలన చేసుకో. మీరు మనస్సును బాగు చేసుకొంటే మీరు ఇంట్లో ఉన్నా సన్యాసంలో ఉన్నట్లే. అంటే పని చేస్తూ ఉంటారు, వ్యక్తిగతమైన కోరిక ఏమీ ఉండదు. జనం అందరూ గంగానదిలో స్నానంచేసి మా పాపాలు పోయినాయి అని వచ్చేస్తున్నారు అంటే వారి పాపాలు అన్నీ గంగానదికి అప్ప చెప్పేసి వస్తున్నారు. మరి గంగానదిలో పాపాలు ఎలా పోతాయి అంటే ఒక మహాత్ముడు, ఒక మహర్షి, ఒక బ్రహ్మజ్ఞాని వెళ్ళి గంగానదిలో స్నానం చేస్తే

గంగానదిలో ఉన్న పాపం అంతాపోతుంది అని చెప్పారు, అది బ్రహ్మజ్ఞానం యొక్క వైభవం. మంచి చెడ్డా మనస్సులో ఉన్నాయి. వారు మంచివారు, వీరు చెడ్డవారు అని ఈ రెండింటి మధ్య తిరుగుతూ ఉంటే మీరు హృదయంలోనికి దిగలేరు. వారు తిట్టారు, వీరు కొట్టారు అని రోజూ ఏడుస్తూ ఉంటే ఇంక నీకు ఆత్మజ్ఞానం ఏమిటి? అసలు భూతకాలం మోసేవాడికి ఎవడికి బ్రహ్మజ్ఞానం కలుగదు. భగవంతుడు చెయ్యమని చెప్పినపనిని మనకు ఇష్టం లేకపోయినా చెయ్యాలి, ఆయన వద్దని చెప్పిన పనిని మానెయ్యాలి. ఎందుకు అని తర్కానికి వెళ్ళకూడదు. అలా తర్కానికి వెళితే బుర్ర పాడైపోతుంది. ఆయన చెప్పాడు కాబట్టి చెయ్యండి, తరువాత వచ్చే ఫలితం ఆయనే చూసుకొంటాడు. మిమ్మల్ని ఎప్పడు అనుగ్రహించాలి, ఎలా అనుగ్రహించాలి అనేది భగవంతుడే చూసుకొంటాడు. మీరు అద్వైతం దాకా వెళ్ళిపోనక్కరలేదు. ద్వైతంలో కూడా మీరు భగవంతుడిని ఎంజాయ్ చెయ్యండి. అలా ఎంజాయ్ చెయ్యగా చెయ్యగా మీకు తెలియకుండా ఆయనలో ఐక్యమైపోతారు అని రాధాకృష్ణన్ చెప్పారు.

కృష్ణుడు చెప్పింది నాకు రోజూ జ్ఞాపకం వస్తోంది. ఎంజాయ్ ఎటర్నిటీ, ఎంజాయ్ బ్లిస్ ఎవ్విరివేర్ అండ్ ఎవ్విరిటైమ్. గుడిలోకి వెళితే నాకు శాంతిగా ఉంటోంది, ఇంట్లో ఉంటే శాంతిగా లేదు. అరుణాచలంలో బాగుంది, కాపవరంలో ఏమీ బాగాలేదు అంటే ఆ మాటలకు అర్థం ఏమిటి? అలా అనుకొంటూ ఉంటే మీకు సబ్జక్టు అర్థం కావటంలేదు. ఒక కాలంలో ఉండి ఇంకొక కాలంలో లేకపోతే, ఒక ప్రాంతంలో ఉండి, ఇంకో ప్రాంతంలో లేకపోతే వాడు దేవుడు ఎలా అవుతాడు. మనకు భక్తి ఉంది అని అనుకొంటున్నాము కాని మనకు భక్తిలేదు ఎందుచేతనంటే భక్తిలేని మూలంగానే భగవంతుడు చెప్పిన మాట మీద మనకు నమ్మకం కలగటంలేదు. నమ్మకం కలగటానికి లోపల మనకు చిత్తశుద్ధి లేదు, తగిన యోగ్యత, అర్హత మనకు లేవు. భగవద్గీత చెప్పినవాడు కృష్ణుడు, విన్నవాడు కృష్ణుడు, వ్రాసిన వాడు కృష్ణుడు కాని మనం ఏమనుకొంటున్నాము ఈ ముగ్గురూ వేరు అనుకొంటున్నాము. ఈ ముగ్గురూ ఆయనే, అదీ గీత యొక్క మహత్యం. ఉపనిషత్‌లో ఋషులు వారి అనుభవాలు చెప్పారు కాని భగవద్గీత అలా కాదు ఆ సృష్టికంతకు ఎవడైతే యజమానో వాడి మొఖంలో నుండి వచ్చిన గ్రంథం, అది గీత యొక్క వైభవం. మీరు బాగుపడటానికి 90 పుస్తకాలు అక్కరలేదు. విష్ణుసహస్ర నామాలు పారాయణ చేసుకోండి, భగవద్గీత చదువుకోండి. మిగతావి ఏమీ చదువుకోవద్దు అనికాదు, మీరు బాగుపడటానికి ఈ రెండూ చాలు.

మనం భగవంతుడిని ఏదో ఒకటి కోరుకొంటూ ఉంటాము, ఆయన ఇస్తూ ఉంటాడు. నిజంగా మీ భక్తి ఆ కోరిక కోసమైతే, ఈ జన్మలో ఇవ్వకపోయినా రాబోయే జన్మలో అయినా అది ఇస్తాడు కాని మోక్షం మాత్రం ఇవ్వడు, అది ఆలోచించుకోండి. మోక్షం ఎప్పుడు వస్తుంది అంటే మీకు భగవంతుడి మీద భక్తి ఉండాలి, ఎక్కడా కోరిక కనపడకూడదు. ఇది ఇలా ఎందుకు జరిగింది, అది అలా ఎందుకు జరిగింది అని అనుకోవద్దు. మీ శరణాగతి నిజమైతే అలా అనుకోరు. మీకు ఏది జరిగినా అది భగవంతుడికి తెలియకుండా జరగటం లేదు. మీ కోడలు రాక్షసి అనుకోండి, మీలో ఉన్న కొన్ని వాసనలను తీసేయటానికే ఆ రాక్షసిని అక్కడ పెట్టాడు కాని లేకపోతే దేశంలో ఇన్ని కుటుంబాలు ఉండగా ఆవిడ మీ ఇంటికే రావటం ఏమిటి? మీకు ఏవో పాఠాలు నేర్పటానికే అక్కడ సిద్ధం చేసాడు. ఆ కోడలు మొట్టికాయలు మొడితేకాని మీ మనస్సు లోపలకు తిరగదు, మనస్సు లోపలకు వెళితేగాని మీకు జ్ఞానం రాదు. జీవకోటిని ఒకోసారి తలుపు సందున పెట్టి నొక్కుతాడు, అలా చేస్తేగాని మనకు బుద్ధి రాదు. ఈశ్వరుడు చెప్పిన మాట యందు మనకు విశ్వాసం ఉండాలి. మీరు గొప్ప పండితులు అవ్వనక్కరలేదు. మీరు శాస్త్రాన్ని పూర్తిగా నమ్ముతున్నారు అనుకోండి, అప్పుడు తన హృదయాన్ని మీకు ఇచ్చేస్తుంది, అప్పుడు శాస్త్రం వెనకాల ఉన్న అర్థం మీ హృదయంలో ప్రవేశిస్తుంది, అది శాస్త్రానుగ్రహం. ఈశ్వరానుగ్రహం లేకుండా, శాస్త్రానుగ్రహం లేకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-11-08, గొరగనమూడి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పరావిద్య అంటే నిర్వాణస్థితికి తీసుకువెళ్ళే విద్య. అపరావిద్య కేవలం వరల్డ్‌కి సంబంధించినది. జ్ఞానానందస్వామి అపరావిద్య, పరావిద్య ఈ రెండింటిలోను కృషి చేసారు. ఆయనకు రెండూ తెలుసు. నేను చాలా విద్యలు నేర్చుకున్నాను అయినా నాకు హృదయంలో తృప్తి కలగటంలేదు, లోపల ఏదో వెలితి ఉంది అనిపిస్తోంది, నాకు శాంతిలేదు అని నారదుడు సనత్‌కుమారుడుని అడిగితే అప్పుడు ఆత్మవిద్య గురించి సనత్‌కుమారుడు చెబుతాడు. ఆత్మ విద్యవల్ల ఆత్మజ్ఞానం పొంది పరిపూర్ణమైన శాంతిని పొందాడు నారదుడు. అర్జునా! విద్యలలో ఆత్మవిద్యను నేను అన్నాడు పరమాత్మ. నువ్వు ఎన్ని విద్యలు నేర్చుకొన్నా నీకు ఆత్మవిద్య లేకుండా, ఆత్మవైభవం తెలియకుండా నీకు ఆత్మసుఖం రాదు అన్నాడు పరమాత్మ. మీలో బాగా చదువుకున్నవాళ్ళు ఉండవచ్చు, ధనవంతులు ఉండవచ్చు, అధికారులు ఉండవచ్చు, కీర్తి